సాక్షి అనకాపల్లి

మంగళవారం : 30 : ఏప్రిల్ : 2024



కారులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



చోడవరం సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

చోడవరం... జన తరంగం

- సీఎం వై.ఎస్.జగన్ సభకు పోటెత్తిన **జన ప్రవాహం**
- మండుటెండలోనూ **వెల్లువెత్తిన అభిమానం**
- తరలివచ్చిన **మహిళాలోకం..** మార్మోగిన **జగన్నినాదం**
- రోడ్లన్నీ **కిక్కిరిసిపోవడంతో మేడలు,** మిద్దెలెక్కిన **అభిమానులు**
- అర్ధగంట పాటు సాగిన సీఎం జగన్ ప్రసంగం
- చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలపై ధ్వజం
- వన్స్‌మోర్ సీఎం.. అంటూ స్పందించిన జనం

నిప్పులు చెరిగిన మండుటెండలో వెల్లువెత్తిన ప్రజాభిమానం ఆత్మీయ జల్లులా మారింది..ప్రియతమ నేత రాకతో చోడవరం జన తరంగమైంది. సిద్ధం సభలు బస్సు యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మలివిడత ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ జన సందోహదంతో దద్దరిల్లింది. తమ అభిమాన ముఖ్యమంత్రిని చూసేందుకు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సభకు పోటెత్తారు. సీఎం ప్రసంగానికి విశేష రీతిలో ప్రజల నుంచి స్పందన వచ్చింది. వన్స్ మోర్ సీఎం...జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

సాక్షి, అనకాపల్లి : చోడవరంలో సోమవారం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ సందర్భంగా ఇటు వడ్డాది వైపు...అటు అనకాపల్లి వైపు రహదారులు జన ప్రవాహంతో కిక్కిరిశాయి. ఉదయం 9 గంటలకే తన అభిమాన నాయకుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మూడు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ ప్రియతమ నేత రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూశారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాగానే జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. రోడ్లన్నీ కిక్కిరిసిపోవడంతో సీఎం జగన్‌ను చూసేందుకు జనం మిద్దెలు, మేడలెక్కారు. స్థానిక వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేసి.. సభా ప్రాంగణానికి తరలివచ్చారు.

రోడ్ షోకు బారులు తీరిన జనం

గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి సోమవారం ఉదయం 10.15 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్లో బయలుదేరి 10.47 గంటలకు చోడవరం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి బయలుదేరి 11.10 గంటలకు సభాస్థలి వద్దకు చేరుకున్నారు. 11.15 కు ప్రారంభించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం 30 నిమిషాల పాటు సాగింది. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. 12.14 గంటలకు హెలికాప్టర్‌లో అంబేద్కర్ జిల్లాకు బయలుదేరారు. సభాస్థలి వరకూ రోడ్డు మార్గాన బయలుదేరిన సీఎంకు అడుగడుగునా నీరా'జనం' పలికారు. చోడవరం రోడ్డులో మహిళలు బారులు తీరి ఆత్మీయ సోదరుడికి హారతులు పట్టారు. అభిమాన నేతను చూసేందుకు మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం తోసుకుంటూ వచ్చారు. వారిని నిలువరించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.



వన్స్ మోర్ సీఎం అంటూ మహిళల నినాదాలు

వన్స్ మోర్.. సీఎం జగన్

జగనన్న ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. సీఎం జగనన్న ప్రసంగిస్తున్న సమయంలో సీఎం.. సీఎం.. అంటూ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. అన్నా..నిన్ను సీఎంగా చేసుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ ప్లకార్డులు చూపిస్తూ నినాదాలు చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో పేపర్‌ను చూపిస్తూ.. ఆయన చేసిన మోసాలను వివరిస్తుంటే..చంద్రబాబు వద్దు..జగనన్నే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సీఎం జగన్ ఒక్కో మాట తూటాలా పేలింది. ఒకవైపు చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను చీల్చి చెండాడుతూనే.. మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో బీజేపీ,టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాన్ని వివరించడంతోపాటు ఈ ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ఆమోదయోగ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఎండగట్టారు. చంద్రబాబు కుయుక్తులు చిత్తు చేసేందుకు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 'మేము సైతం సిద్ధం' అంటూ జనం నినదించారు.

మీలో ఒక్కడు...మీ లోకల్...

అనంతరం వైఎస్సార్‌సీపీ తరపున పార్లమెంట్ అభ్యర్థిగా 'మీలో ఒక్కడైన మీ లోకల్‌ని..మన అభ్యర్థిగా ముత్యాలనాయుడిని ఎంపీగా నిలబెడుతున్నాను. మీ చల్లని ఆశీస్సులు.. దీవెనలతో ఆశీర్వదించండి' అని కోరారు. చోడవరం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న ధర్మశ్రీ అన్నకు మీ ఆశీస్సులుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, శాసనమండలి విప్ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, చోడవరం నియోజకవర్గం పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరింగరావు, జెడ్పీటీసీ మారిశెట్టి శ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావ్, పారిశ్రామిక వేత్త ధర్మతేజ్ రెడ్డి పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్ : బూడి

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రజలు స్థానికులనే గెలిపిస్తూ ఉంటారు. గతంలో మెగా ఫ్యామిలీకి చెందిన అల్లు అరవింద్, పత్రికా రంగానికి చెందిన నూకారపు సూర్యప్రకాష్‌రావును ఓడించారు. ఈ ఎన్నికల్లో కూడా అదే తీర్పు రిపీట్ కానుంది. అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి నేను స్థానికుడి హోదాలో పోటీ చేస్తున్నాను. నేను పక్కా లోకల్. ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్థానికంగా అందుబాటులో ఉంటాను. అవతల వ్యక్తి బ్యాంక్‌లను మోసం చేసిన డబ్బులతో అనకాపల్లి ప్రాంతంలో వనరులను దోచుకోవడానికి వచ్చాడు. నేను సామాన్య వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తిని. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగకుండా పారదర్శకంగా రూ.2.70 లక్షల కోట్ల సంక్షేమం అందించిన ఏకైక సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ఐదేళ్లలో సంక్షేమ లబ్ధి పొందిన ప్రతి కుటుంబం మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరో మారు సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలి.

ఎడ్యుకేషనల్ హబ్‌గా చోడవరం : ధర్మశ్రీ

టీడీపీకి ఓటు వేస్తే.. పేదోడి కడుపు మీద కొట్టినట్టే. మహానేత వైఎస్సార్ తీసుకొచ్చిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశాడు. మళ్లీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తరువాత భూ పరిహారం అందజేసేందుకు సర్వేలు కూడా చేపట్టాం. ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.2,800 కోట్లు సం క్షేమం, అభివృద్ధి జరిగింది. పారిశ్రామిక సెజ్ ఏర్పాటుకు చోడవరం మండలం దొడ్డిపాలెం, వెంకన్నపాలెం, బుచ్చెయపేట మండలం కోమళ్లపూడిలో సెజ్ ఏర్పాటుకు 250 ఎకరాలు భూసేకరణ పూర్తయింది. మరో 300 ఎకరాలు భూసేకరణ జరుగుతోంది. టీడీపీ హయాంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రూ.150 కోట్ల వరకూ అప్పుల ఊబిలోకి నెట్టగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.120 కోట్లు అప్పు తీర్చాం. టీడీపీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణం ఆలస్యం అయింది. దాన్ని సీఎం చొరవతో రూ.95 లక్షలతో పూర్తి చేశాం. రూ.35 కోట్లతో జ్యోతిరావు పూలే బాలికల సంక్షేమ వసతి గృహం ఏర్పాటుకు నిధులు మంజూరు చేశాం. చోడవరంలో పీజీ కాలేజి ఏర్పాటుచేశాం. రూ.12 కోట్లతో వెంకన్నపాలెంలో పాలిటెక్నికల్ కళాశాలకు స్థల సేకరణ పూర్తయింది. రైవాడ జలాశయం కుడి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేసే బాధ్యత ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు, నేను తీసుకుంటాం.

జగన్ పాలనలో దళితులశ్రేయస్సు : బాబూరావు

గతంలో మూడు మార్లు ఎమ్మెల్యేలుగా దళితుడైన తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. ఇప్పుడు రాజ్యసభకు అవకాశం కల్పించి దళితులకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న దళిత ప్రజలంతా మళ్లీ సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించే బాధ్యతను తీసుకోవాలి. మళ్లీ సీఎంగా వై.ఎస్.జగన్ వస్తే రాష్ట్రంలో ఉన్న దళితులంతా సంతోషంగా ఉంటారు. దళితుల శ్రేయస్సు కోసం పనిచేసిన జగనన్న ప్రభుత్వాన్ని రేపటి ఎన్నికల్లో అందరం ఏకమై గెలిపించుకుందాం.



అదిగో జగనన్న...మదిలో రాజన్న



ఇంతులు... కేరింతలు



జగనన్నా మేమంతా నీ ఫ్యాన్స్..

జన జాతరలో వంగపండు పాట

సీఎం సభలో ప్రజా గాయకురాలు వంగపండు ఉష బృందం ఉదయం 9.30 గంటల నుంచి ఉరకలెత్తించే పాటలతో ఉర్రూతలూగించారు. ప్రతిపక్ష నేతలను ఎండగడుతూ, సీఎం జగన్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడుతూ అలుపెరగకుండా పాడిన పాటలకు సభకు హాజరైన యువత అంతే ఎనర్జీతో సొలుపన్నదీ లేదన్నట్టు వైఎస్సార్‌సీపీ జెండాలను భుజాన వేసుకుని మరీ గెంతులేశారు. గంటపాటు ఈ సాంస్కృతిక కార్యక్రమం అలరించింది.

బ్యాంక్ ఖాతాలకే సామాజిక పింఛన్లు

- జిల్లాలో 1,97,790 మందికి మే 1న పింఛను జమ
- రిజక్ట్ అయినవారికి ఇంటి వద్దకే పింఛన్లు

3వ తేదీ నుంచి 8 వరకు హోమ్ ఓటింగ్

- 6 నుంచి 8 వరకు పోస్టల్ ఓటింగ్


అంతా ప్యాకేజీ మహిమ!

- తొలుత బీరాలు.. ఆపై బేరాలు
- చివరకు రాజీపడ్డ రెబల్ అభ్యర్థులు
- వారిని నమ్ముకొని నిండా మునిగిన అనుచరులు

8లో

లోక్‌సభ 15 అసెంబ్లీ 54

- బరిలో మిగిలిన అభ్యర్థులు
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ



కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో మరో అంకం ముగిసింది. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ సోమవారంతో పూర్తయింది. బరిలో నిలిచిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సోమవారం నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి 15 మంది, జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 54 మంది బరిలో నిలిచారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి మొత్తం 22 మంది నామినేషన్లు ఆమోదం పొందగా ఏడుగురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో బరిలో 15 మంది నిలిచారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలకుగాను 63 నామినేషన్లు ఆమోదం పొందగా, తొమ్మిది మంది ఉపసంహరించుకున్నారు. దీంతో 54 మంది బరిలో నిలిచారు.

పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న వారిలో వైఎస్సార్‌సీపీ నుంచి బూడి ముత్యాలనాయుడు, బీజేపీ నుంచి సి.ఎం.రమేష్, కాంగ్రెస్ నుంచి వేగి వెంకటేష్, బహుజన సమాజ్ పార్టీ నుంచి పలకా శ్రీరామమూర్తి, ఇంకా రిజిస్టర్డ్ పార్టీల నుంచి నమ్మి అప్పలరాజు, కర్రి విజయలక్ష్మి, వడ్లమాని కృష్ణ స్వరూప్, ఆడారి శరత్‌చంద్ర, స్వతంత్ర అభ్యర్థులుగా సిద్ధ లోవరాజు, వంకాయల రామచంద్రరావు, తుమ్మగంట అప్పలనాయుడు, తుమ్మపాల హరిశంకర్, గారా సూర్యారావు, జున్నూరి శ్రీనివాస్ , పెట్ల నాగేశ్వరరావులు పోటీలో నిలిచారు. పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థిగా సి.ఎం.రమేష్ పోటీ చేస్తుండగా జనసేనకు కేటాయించిన గాజు గ్లాసు గుర్తు దళిత బహుజన పార్టీ తరపున పోటీ చేస్తున్న వడ్లమాని కృష్ణస్వరూప్‌కు కేటాయించడం విశేషం. ఇక్కడ పొత్తులో భాగంగా అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన తరపున కొణతాల రామకృష్ణ పోటీ చేస్తున్నారు. ఈయనకు గాజు గ్లాసు గుర్తు కేటాయించగా ఎంపీ అభ్యర్థి విషయంలో మాత్రం దళిత బహుజన పార్టీకి ఇదే గుర్తు కేటాయించడం గమనార్హం.

- ఇక అనకాపల్లి ఎమ్మెల్యేస్థానానికి మొత్తం 12 నామినేషన్లు ఆమోదం పొందగా ఎవరూ ఉపసంహరించుకోకపోవడంతో 12 మంది బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి మలసాల భరత్‌కుమార్, జనసేన నుంచి కొణతాల రామకృష్ణ పోటీ చేస్తున్నారు.
- పాయకరావుపేటనుంచి 10 మంది నామినేషన్లు ఆమోదం పొందగా ఉపసంహరణ అనంతరం 9 మంది బరిలో నిలిచారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ నుంచి కంబాల జోగులు, టీడీపీ నుంచి వంగల పూడి అనిత బరిలో ఉన్నారు.
- మాడుగుల నుంచి 11 మంది నామినేషన్లు ఆమోదం పొందగా ఉపసంహరణ అనంతరం 9 మంది బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఈర్లె అనూరాధ, టీడీపీ నుంచి బండారు సత్యనారాయణమూర్తి పోటీలో ఉన్నారు.
- చోడవరం నుంచి 8 నామినేషన్లు ఆమోదం పొందగా ఉపసంహరణ అనంతరం ఆరుగురు బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి కరణం ధర్మశ్రీ, టీడీపీ నుంచి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పోటీ చేస్తున్నారు.
- నర్సీపట్నం నుంచి స్క్రూటినీలో 8 మంది నామినేషన్లు ఆమోదం పొందగా ఎవరూ ఉపసంహరించుకోలేదు. వైఎస్సార్‌సీపీ నుంచి పెట్ల ఉమాశంకర్ గణేష్, టీడీపీ నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు పోటీ చేస్తున్నారు.
- యలమంచిలి నుంచి 14 మంది నామినేషన్లు ఆమోదం పొందగా ఉపసంహరణ అనంతరం 10 మంది పోటీ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి యు.వి.రమణమూర్తిరాజు, జనసేన నుంచి సుందరపు విజయ్‌కుమార్ పోటీలో ఉన్నారు.

పోటీలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు



ముత్యాలనాయుడు (అనకాపల్లి పార్లమెంట్) | కరణం ధర్మశ్రీ (చోడవరం) | ఈర్లె అనురాధ (మాడుగుల) | కంబాల జోగులు (పాయకరావుపేట) | పెట్ల ఉమాశంకర్ గణేష్ (నర్సీపట్నం) | భరత్ కుమార్ (అనకాపల్లి) | రమణమూర్తిరాజు (యలమంచిలి)

ఉప్పొంగిన అభిమానం...


చంద్రబాబు హయాంలో మేలు జరిగిందా అని సీఎం జగన్ ప్రశ్నిస్తే.. లేదంటూ చేతులు ఊపుతున్న ప్రజలు

నవరత్నాలతో తమ బతుకుల్లో వెలుగులు నింపిన జగన్‌మోహన్ రెడ్డిని ఒక్కసారి చూడాలన్న ఆశ.. కడుపులో చల్ల కదలకుండా ఇంటివద్దే పింఛన్ అందజేసిన పెద్దకొడుకుతో మాట్లాడాలన్న కోరిక...అందుకే భగభగమండే ఎండలో సైతం చిన్నాపెద్దా, అవ్వాతాత స్వచ్ఛందంగా తరలివచ్చారు. సకలాంగులు, దివ్యాంగులు అన్ని తేడా లేకుండా కదిలారు. వైఎస్ జగన్‌ను చూసేందుకు అభిమాన జనసంద్రం పోటెత్తింది... నువ్వే మా నమ్మకం అంటూ నినదించింది... మా బతుకులు మార్చిన మా బిడ్డే మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించింది.

– చోడవరం రూరల్/రావికమతం


సీఎం వాహనంపై మహిళల పూలవర్షం


సీఎం ప్రసంగంలో మహిళల కరతాళ ధ్వనులు


గుమ్మడికాయలతో దిష్టితీస్తున్న మహిళలు


మండుటెండలో చంటిపిల్లాడితో...

జగన్‌బాబు సల్లగుండాల....



ముఖ్యమంత్రి జగన్‌బాబు సల్లగుండాల. ఆయనే మళ్లీ సీఎం కావాల. మాలాంటి ముసిలి ముడగ దైర్నంగా బతకాలంటే జగనయితేనే బాగుంతాది. ఆయన్ని సూడాలనే ఇంత ఎండయినా కూడా ఇంత దూరం వచ్చాను. నాకు వయసు తక్కువ ఉండడంతో సేయూత డబ్బులు పడతన్నాయి. మా వోడు(భర్త)కి పెనషన్ వస్తంది. నానే కాదు మా వూరు వూరంతా జగన్‌కే ఓట్లేత్తారు. ఆయన ఉంటూ పేదాసాదా బాగుపడతారు. నా ఓటు పేనుకే..

– రాజాన కన్నయ్యమ్మ, బెన్నవరం

మాకు నచ్చే వచ్చాం.. ఏటి సేత్తావు.. మాకేటీ రాకుండా సేత్తావా..



మాకు జగనుబాబంటే నచ్చే వచ్చాం. మా ఓటు జగన్‌కే. నువ్వు ఇయన్నీ అడుగుతున్నావ్, ఏటిసేత్తావ్, మాకొచ్చేయన్నీ ఆపించేత్తావా.. నువ్వేం చేసినా మాం మాత్రం పేనుకే ఓటేత్తాం. నువ్వు ఏం చేసినా పర్లేదు. నాకు పెన్సన్ వస్తంది. మకన్నీ జగనే సేత్తన్నాడు. ఆ బాబే మల్లా రావాల. అందుకే మేం వచ్చాం. మా పేదోలకి ఇంతకన్నా ఏటి కావాల. కడుపుకింత అన్నం దొరికితే అదే పదివేలు.

– టొల్లల అర్జునమ్మ, జడ్.బెన్నవరం

నాయకులేటిసేత్తారో... మాం మాతరం జగన్‌కే....



నాకు పెన్సన్ వత్తంది. ఇంటికే తెచ్చివోలు. అయితే పోయిన నెల నుంచి వాలంట్రీ రాలేదు. ఈ ఎలచ్చన్ అయిపోయా వరకు ఇంతేనట. మళ్లీ జగనొత్తే ఇంటికే వత్తాదంటన్నారు. ఊరి నాయకుల్ని బట్టి పెజలు ఉంతారు. నాయకులు మంచి చేత్తే అలు ఎలగంటే అలగే చేత్తారు. మా నాయకులు పరవానేదు. ఆలు ఏది చెబితే అదే. మిగతా ఊరుల్లో నాయకులేటిసేత్తారో..ఏటో మరి. మాకయితే జగనువల్ల అంతా మంచే జరిగింది. రైతుబరోసా పడింది. యవసాయంకి అది తోడయ్యింది. ఇది వరకల్లా అప్పులకు వెల్లవలసి రానేదు. అందుకే నాకయితే మల్లా జగనే రావాలనే ఉంది. అందుకే ఎండయినా కూడా మీటింగుకి వచ్చాను. ఆయన చెప్పినట్టు ఆయన వస్తేనే ఈ పతకాలన్నీ సాగుతాయి. నా ఓటు పేనుకే ఏస్తాను..

–ఎలుసూరి లక్ష్మణ, మత్స్యపురం

ఇంటికే పింఛన్ ఇస్తామన్నారు..



మా జగన్‌బాబును చూడాలని ముందుగానే సభకు వచ్చాము. బస్సుకు దగ్గరగా నిలుచుని ఆ బాబును చూసాము. మారాజు మాటలు విన్నాము. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితే వలంటీర్‌తో ఇంటికే పింఛన్ అందిస్తామన్నాడు.అదిచాలు మాకు. మొన్న ఎండలో పంచాయితీకి వెళ్లలేక చాలా బాదలు పడ్డాం.

జగ్గమ్మ,అప్పలనర్స అన్నవరం కాలనీ,చోడవరం

మళ్లీ జగన్‌బాబుకే ఓటేస్తాను..



నాకు వైఎస్ఆర్ చేయూత కింద రూ.18,750 చొప్పున నాలుగు విడతలు అందాయి. ఆ మొత్తంతో ఇంటి దగ్గరే కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. మాకుటుంబం జీవనోపాధికి జగన్‌బాబు చక్కని మార్గం చూపాడు. ఆయన సాయం నేను మరువలేను.మళ్లీ ఆ పథకాన్ని అమలు చేస్తానన్నాడు. ఈ దఫా మాకోడలుకు వర్తిస్తుంది. మళ్లీ ఆబాబుకే ఓటేస్తాను.దూరమైనా జగన్‌బాబును చూద్దామని ఇంత దూరం ఎండలో వాచ్చాను.

ఎస్.లక్ష్మమ్మ, కొత్తకోట,రావికమతం మండలం

చేజారిన 'గాజు గ్లాస్'

- గుర్తు కోసం ఆర్వో కార్యాలయం వద్ద హైడ్రామా
- స్వతంత్రులకి కేటాయించకుండా బీజేపీ, టీడీపీ పైరవీలు
- సీఎం రమేష్, అనిత జోక్యం చేసుకున్నా దక్కని ఫలితం
- డీబీపీ అభ్యర్థికి కేటాయింపు



నక్కపల్లి ఆర్వో కార్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి అనిత (ఇన్‌సెట్) గాజు గ్లాస్ గుర్తు సాధించుకున్న దళిత బహుజన పార్టీ అభ్యర్థి కృష్ణ స్వరూప్

నక్కపల్లి: ఎన్నికల బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు కేటాయింపు విషయంలో వివాదం నెలకొంది. ఆర్వో కేంద్రాల వద్ద చాలా సేపు హైడ్రామా నడిచింది. సీఎం రమేష్, వంగలపూడి అనిత ఇండిపెండెంట్లకు గాజు గ్లాసు గుర్తు కేటాయించకుండా పైరవీలు చేశారు. అయినా ఫలితం దక్కలేదు. వివరాల్లోకి వెళ్తే...గాజు గ్లాసు గుర్తు ఎన్నికల సంఘం జనసేన పార్టీకి కేటాయించింది. ఎన్నికల నియమావళి ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కామన్ సింబల్ కేటాయిస్తారు. అయితే జనసేనకు గాజు గ్లాసు గుర్తు కేటాయించినప్పటికీ ఎన్నికల సంఘం వద్ద జనసేన పార్టీ కేవలం రిజిస్టర్ అయిన పార్టీగానే మిగిలిపోయింది. ఎన్నికల సంఘం గాజు గ్లాసును ఫ్రీ సింబల్ జాబితాలో చేర్చి గెజిట్ విడుదల చేసింది. జనసేన పార్టీ పోటీ చేసిన చోట్ల గాజుగ్లాసు గుర్తును ఆ పార్టీకి కేటాయించాలని, జనసేన పోటీ చేయని చోటఫ్రీ సింబల్‌గా ప్రకటిస్తూ ఇండిపెండెంట్లకు ఈ గుర్తు కేటాయించవచ్చని ఎన్నికల సంఘం సూచించింది. పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి, అనకాపల్లి ఎంపీ స్థానానికి సుప్రీంకోర్టు న్యాయవాది, దళిత బహుజన పార్టీ వ్యవస్థాపకుడు అయిన వడ్లమాని కృష్ణ స్వరూప్ నామినేషన్ వేశారు. తనకు గాజు గ్లాసు గుర్తు కేటాయించాలని కోరారు. ఈ గుర్తు ఫ్రీ సింబల్‌గా ప్రకటించినందున ప్రాధాన్యతా క్రమంలో తనకు ఈ గుర్తు కేటాయించాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న అనిత పాయకరావుపేట ఆర్వో కార్యాలయానికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనిత ఇచ్చిన సమాచారంతో సీఎం రమేష్ కూడా కలెక్టర్ కార్యాలయంలో తన అభ్యంతరాన్ని లేవనెత్తి గుర్తు కేటాయించకుండా పైరవీలు చేశారు. కృష్ణస్వరూప్ వాదనతో ఏకీభవించిన అధికారులు ఎన్నికల నిబంధనల ప్రకారం ఆయనకు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తు కేటాయించారు.

అంతా ప్యాకేజీ మహిమ!



- తొలుత బీరాలు.. ఆపై బేరాలు
- చివరకు రాజీపడ్డ రెబల్ అభ్యర్థులు
- వారిని నమ్ముకొని నిండా మునిగిన అనుచరులు

సాక్షి, విశాఖపట్నం: అంతన్నారు.. ఇంతన్నారు.. సీటివ్వకపోతే తమ తడాఖా చూపుతామన్నారు. రెబల్‌గా బరిలోకి దిగి తమ సత్తా చాటుతామన్నారు. ఎన్నెన్నో బీరాలు పలికారు.. చివరకు బేరాలకు దిగారు. అన్నట్టుగానే నామినేషన్లు దాఖలు చేసిన వీరు ఉపసంహరణలో తోక ముడిచారు. ప్యాకేజీలతో రాజీపడి ఇన్నాళ్లూ తమను నమ్ముకున్న అనుచరులను నిండా ముంచారు. అయోమయంలోకి నెట్టారు. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు తొలుత చాలా హంగామా చేశారు. వీరిలో మొదట్లో టికెట్ దక్కించుకున్న వారు, టికెట్ ఆశించి ఆశాభంగమైన వారూ ఉన్నారు.

- యలమంచిలి టీడీపీ టికెట్ ఆశించిన అక్కడ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు.. పొత్తులో జనసేనకు కేటాయించడంతో తన అనుచరులతో పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. తొలుత రెబల్‌గా బరిలోకి దిగుతానన్న ఆయన కొద్దిరోజులకు మెత్తబడి ఇప్పుడు జనసేన అభ్యర్థి తరపున ప్రచారంలో పాల్గొంటున్నారు.
- అనకాపల్లి సీటును పొత్తులో జనసేనకు కేటాయించడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ ఆశావహుడు పీలా గోవింద సత్యనారాయణ ఆరంభంలో హడావుడి చేశారు. కొన్నాళ్లకే ఆయన రాజీపడి జనసేన అభ్యర్థి ప్రచారంలో తిరుగుతున్నారు.
- భీమిలి జనసేన సీటు తనకే ఖాయమని నమ్మకంతో ఉన్న పంచకర్ల సందీప్‌ను కాదని ఆఖరి నిమిషంలో టీడీపీ అభ్యర్థి గంటాకు కేటాయించారు. దీంతో తాను గంటాకు సహకరించబోనని తొలుత ప్రకటించి ఆ తర్వాత ఆయన వెంటే తిరుగుతున్నారు. అలాగే ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకుడు కోరాడ రాజబాబు.. గంటా పెద్ద అవినీతిపరుడని, ఆయన ఓటమే తన లక్ష్యమని మీడియా సమావేశంలో ప్రకటించారు. కొద్దిరోజులకే ఆయన తోకముడిచి గంటా ప్రచారంలో ప్రత్యక్షమయ్యారు.
- విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన సీటును ఆశించిన కార్పొరేటర్లు కందుల నాగరాజు, మహ్మద్ సాధిక్‌లు భంగపడ్డారు. అక్కడ టికెట్‌ను వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించడంతో వీరు తిరుగుబాటు చేశారు. ఎన్నికల్లో తన తడాఖా చూపించి వంశీకృష్ణను ఓడిస్తామని మీడియా సమావేశాలు పెట్టి మరీ బెదిరించారు. తీరా ఇప్పుడు వీరిద్దరూ వంశీకృష్ణ పంచకు చేరిపోయారు.
- టీడీపీ మాడుగుల అసెంబ్లీ స్థానానికి ముందుగా పైలా ప్రసాద్‌ను ప్రకటించింది. ఆయన ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న సమయంలో ఇటీవల ఆయన్ను కాదని పెందుర్తికి చెందిన బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించింది. దీంతో పైలా మాడుగుల అసెంబ్లీతో పాటు అనకాపల్లి లోక్‌సభ స్థానానికి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సోమవారం ఆయన తన నామినేషన్లను ఉపసంహరించుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు.
- టీడీపీ అధినేత చంద్రబాబు మొట్టమొదటి సారిగా అరకు అసెంబ్లీ స్థానాన్ని దొన్నుదొరకు ప్రకటించారు. ఆయన ప్రచారం చేసుకుంటుండగా ఆ సీటును బీజేపీకి మార్పు చేశారు. దీంతో షాక్ తిన్న దొన్నుదొర రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించి ఆ తర్వాత రాజీ పడ్డారు.
- పాడేరు టీడీపీ సీటును తొలుత రమేష్‌నాయుడుకు ప్రకటించారు. దీంతో ఆ సీటును ఆశించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి రెబల్‌గా పోటీ చేస్తానని స్పష్టం చేయడంతో అధిష్టానం ఆమెకే ఖరారు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన రమేష్‌నాయుడు రెబల్‌గా నామినేషన్ వేసి సోమవారం ఉపసంహరించుకున్నారు.
- ఇక రంపచోడవరం టీడీపీ సీటును శిరీషకు కేటాయించడంతో మనస్తాపం చెందిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించి చివరకు నామినేషన్ వేయకుండానే రాజీ పడ్డారు.

ఇలా టీడీపీ, జనసేన టికెట్లు ఆశించిన వారు తొలుత తమ సత్తా చూపుతామని బెదిరించడం, ఇప్పుడు వారంతా తోక ముడిచి ఆయా పార్టీల అభ్యర్థులకే మద్దతు పలకడం అంతా ప్యాకేజీ మహిమేనంటూ వారి అనుచరులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఎవరి స్థాయిలో వారికి బేరాలు కుదరడంతో నిస్సిగ్గుగా ప్రచారాల్లో పాల్గొంటున్నారని వీరు పేర్కొంటున్నారు. వీరిని నమ్మి తాము మోసపోయామని, తమ నేతలు మాత్రం భారీగా లాభపడ్డారని వాపోతున్నారు.

జగన్‌ను గెలిపించుకుంటే మరింత మంచి పాలన

- రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


ఎన్నికల ప్రచార రథంపై మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో మలసాల భరత్‌కుమార్

తుమ్మపాల: సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ మరింత మంచి పాలనకు శ్రీకారం చుడతారని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరమూ కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాల్సిన సమయం వచ్చిందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కోడూరులో సోమవారం ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి రూపురేఖలు మార్చగల సమర్థుడు, యువకుడు మలసాల భరత్‌కుమార్‌ను, ఎల్లప్పుడు మీతోనే ఉంటు మీతో కలిసి పోయే బూడి ముత్యాలనాయుడిని ఎంపీ, ఎమ్మెల్యేలుగా చేసుకోవాలన్నారు. గత టీడీపీ పాలనకు ఇప్పటి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకుని ప్రజలందరూ ఓటు వేయాలన్నారు. ఇక్కడ ప్రజల ఓట్లతో గెలిచి మంత్రిగా చేసిన వ్యక్తి పదేళ్ల పాటు ఆచూకీ లేకుండా పోయి ఇప్పుడు ఎన్నికలొచ్చాయని ఓట్ల కోసం తిరుగుతున్నారని విమర్శించారు. కరోనా వంటి కష్టకాలంలో మీకు తోడుగా ఉంటూ సంక్షేమ పథకాలు అందించింది జగన్ ప్రభుత్వమే అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోకపోతే మనకు వస్తున్న ఒక్క పథకమూ రాదన్నారు. మొత్తం పథకాలను నిలిపివేసి మళ్లీ జన్మభూమి కమిటీల పాలన రాష్ట్రంలోకి తీసుకొస్తారన్నారు. మూడు సార్లు సీఎంగా చేసిన చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమైన ఉందా అని ప్రశ్నించారు. తాను గెలిస్తే మన ప్రాంతంలోనే ఐటీ కంపెనీ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. తనపై పోటీ చేస్తున్న వ్యక్తి గతంలో ఇక్కడ ఏమి చేసారో చెప్పాలన్నారు. అనంతరం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామాకాలనీ, మారేడుపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ బీవీ సత్యవతి, ఏపీ ఇన్‌ల్యాండ్స్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేటి కాశి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల ప్రెసిడెంట్ గోవింద, పీఏసీఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన బూడి ముత్యాలనాయుడు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు
- 108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు


108 వాహనంలోకి క్షతగాత్రుడిని ఎక్కిస్తున్న దృశ్యం

చీడికాడ: అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే ఆయన సాటి వ్యక్తి కష్టాల్లో ఉన్నారంటే చలించిపోతారు. తాజాగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సపర్యలు చేయించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలో శిరిజాం శివారు ఎస్.ఎన్.పురానికి చెందిన చంద్రు అనే యువకుడు అర్జునగిరిలో బంధువుల ఇంట శుభ కార్యానికి తురువోలు మీదుగా తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన బుగత చినఅప్పలనాయుడు, పుట్టా శేనయ్య తమ ఎక్సెల్ మోపెడ్‌పై అర్జునగిరి నుంచి తురువోలు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు మలుపులో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీ కొట్టాయి. దాంతో వారంతా కింద పడి గాయపడ్డారు. అదే సమయంలో చోడవరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభలో పాల్గొని వస్తున్న బూడి ముత్యాలనాయుడు ఇక్కడ రోడ్డు ప్రమాదం చూసి కారు ఆపి దిగారు. వెంటనే గాయపడిన వారిని రోడ్డు పక్కన నీడకు చేర్చారు. కారులో బాటిళ్లు తెచ్చి వాటర్ తాగించారు. చీడికాడ పీహెచ్‌సీలో 108కు ఫోన్ చేశారు. క్షతగాత్రుల గ్రామాల సర్పంచ్‌లకు ఫోన్లు చేసి వారి కుటుంబ సభ్యులను రప్పించారు. 108 వాహనం వచ్చిన తర్వాత దగ్గరుండి ఎక్కించి ధైర్యం చెప్పారు. గతంలో ఇదే విధంగా కె.కోటపాడు మండలం సూదివలస వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని తన కారులోనే ఆస్పత్రికి తరలించి సకాలంలో ఆదుకున్నారు. ఈ విధంగా ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.

బ్యాంక్ ఖాతాలకే సామాజిక పింఛన్లు

తుమ్మపాల : సార్వత్రిక ఎన్నికలు – 2024 ఎన్నికల నియమావళికి లోబడి సామాజిక భద్రత పింఛనుదారులకు మే, జూన్ నెలల్లో పంపిణీ చేయనున్న పింఛను సొమ్మును వారి బ్యాంకు ఖాతాలకు జమచేయనున్నట్లు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని డీఆర్డీఏ పీడీ కె.శచిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,65,210 మంది పింఛనుదారుల్లో 1,97,790 మందికి డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో మే 1న నగదు జమచేయనున్నట్లు తెలిపారు. 67,420 మంది దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వీల్‌చైర్, మంచానికి పరిమితమైన వారు, సైనిక్ వెల్ఫేర్ పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి పింఛను సొమ్ము అందిస్తారని తెలిపారు. డీబీటీ పద్ధతిలో రిజక్ట్ అయినవారికి కూడా ఇంటి వద్దనే నగదు అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

టీడీపీలోనూ సీఎం రమేష్‌దే హవా

- బీజేపీలో ఉన్నా టీడీపీలో పదవులు ఇప్పించగలరు
- ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి


దేవరాపల్లిలో పైలా ప్రసాదరావుతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి : బీజేపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పార్టీ పరంగా బీజేపీలో ఉన్నప్పటికీ టీడీపీలో తన హవా కొనసాగిస్తున్నారు. తన సిఫార్సులతో టీడీపీలో కీలక పదవులు సైతం ఇప్పించగలరని మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి వ్యాఖ్యానించారు. టీడీపీలో 30 ఏళ్లు కొనసాగిన సీఎం రమేష్ పార్టీని వీడినా తన అనుబంధాన్ని నేటికీ కొనసాగిస్తున్నారని బండారు స్పష్టం చేశారు. దేవరాపల్లిలోని టీడీపీ నేత పైలా ప్రసాదరావు, అతని వర్గీయులతో కలిసి పైలా కార్యాలయంలో సోమవారం ఆయన సమావేశమయ్యారు. మాడుగుల టీడీపీ అభ్యర్థిగా పైలా ప్రసాదరావును తప్పించడం తనకు బాధ కలిగించిందని, తప్పనిసరి పరిస్థితుల్లో అధిష్టానం ఆదేశాల మేరకు ఇక్కడికి రావాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గంలో పైలాకు సముచిత స్థానం కల్పిస్తామని బండారు చెప్పగా, ఏ స్థానం కల్పిస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని పైలా వర్గీయులు పట్టుబట్టారు. దీంతో ఆ విషయం అధిష్టానం చూసుకుంటుందని బండారు మాట దాటవేయడంతో పైలా వర్గీయులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో మూడు, నాలుగు గ్రూపులు ఉన్నందున ఇప్పుడు ఎవరికి ఎటువంటి హామీ ఇచ్చినా మరో గ్రూపు ఎదురుతిరిగే అవకాశం ఉన్నందున తాము ఏ నిర్ణయం తీసుకోలేన్నామన్నారు. తమకు ఈ గ్రూపుల గోలతోనే సమయం సరి పోతుందన్నారు. గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చిన ఓట్లు ఆధారంగా నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో స్థానికేతరులైన నాయకులను తీసుకువచ్చి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన తమను చిన్నచూపు చూసి పెత్తనం చెలాయించడం ఏమిటని టీడీపీ నాయకులు బాహాటంగానే అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు.

3వ తేదీ నుంచి 8 వరకు హోమ్ ఓటింగ్

తుమ్మపాల : వచ్చే నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హోమ్ ఓటింగ్ కోసం చర్యలు చేపడుతున్నట్టు పోస్టల్ బాలెట్ నోడల్ అధికారి ఎం.రోజారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్‌కు ప్రత్యేక బృందాలను నియమించి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఒక్కో బృందంలో ఒక ఏపీఓ, ముగ్గురు ఓపీఓలు, ఒక పోలీస్, వీడియోగ్రాఫర్ ఉంటారన్నారు. ప్రతి నియోజకవర్గంలో 4 నుంచి 5 బృందాలను నియమించడం జరిగిందన్నారు. అలాగే ప్రతి ఆర్వో కార్యాలయం వద్ద పోస్టల్ ఓటింగ్ కేంద్రాలు, ఫెసిలిటేట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయా కేంద్రాల నోడల్ అధికారిగా పోస్టల్ బాలెట్ ఏఆర్వో ఉంటారని, ప్రతి బూత్‌లో 1+3 సిబ్బంది ఉంటారని తెలిపారు. మే నెల 6 నుంచి 8తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు అందుబాటులో సిబ్బంది ఉంటారన్నారు. అన్ని రకాల పోస్టల్ ఓటింగ్ మే నెల 8 నాటికి పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇష్టపడి చదవితే ఉజ్వల భవిష్యత్


సత్కారం పొందిన విద్యార్థులు

మునగపాక: విద్యార్థులుఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని శ్రీ వెంకటేశ్వర గీత ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు అన్నారు. పదవతరగతి ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులు విల్లూరి యామిని,భీశెట్టి గీత, టెక్కలి జయశ్రీ, ఆళ్ల అనూషలను ఆదివారం రాత్రి ఆ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో రాణించాలంటే ఏకాగ్రతతో పాటు ఇష్టపడి,కష్టపడి చదవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రచార సమితి సభ్యులు శరగడం గణేష్, మాధవి,రాంబాబు, మురళి, అర్జున్, వెంకట్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


మూలపేటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం

మునగపాక:మండలంలోని మూలపేటలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్.శ్రీనివాస్ శామ్యూల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ తృతీయ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని పాలకేంద్రం ఆవరణలో నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వైద్యులు శాంతి సౌందర్య, శ్రీధర్,సరోజిని శిబిరంలో సేవలందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ భార్య లక్ష్మి,కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట:మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో కూరగాయల ధరలు సోమవారం దాదాపుగా స్థిరంగా ఉన్నాయి. టమాటా, ఉల్లి కిలో రూ.25, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, దొండ, వంకాయ, బెండకాయ, చిలకడ దుంప రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ,కాకరకాయ కిలో రూ.60 చొప్పున విక్రయించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 2,771 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,840	4,740
మొదటి రకం	3,600	4,580
రెండో రకం	3,510	4,190
మూడోరకం	3,210	3,520

అనకాపల్లి సినిమాలు

ప్రాజెక్టు	: రాజా
పారిజాత పర్వం	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-8 యూనిట్లు, బి పాజిటివ్-25 యూనిట్లు, ఒ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 269 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

ఇంటింటా ప్రచార హోరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థులు, నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధికమెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు.


తనకు ఓటు వేయాలని తాళ్లపాలెం సంతలో పండ్ల వ్యాపారిని కోరుతున్న అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్


మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ


వాడనర్సాపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ రామారావు తదితరులు


నారాయుడుపాలెంలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ


అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌వద్ద కర్రివారివీధిలో ప్రచారం చేస్తున్న మండపాటి జానకీరామరాజు

కశింకోట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే దాన్ని అమలు చేసి తీరుతారని అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను గాలికొదిలేసే వారి మాటలను విశ్వసించవద్దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలతోపాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. సంతలో నిర్వహించిన ప్రచారానికి విశేష ఆదరణ లభించింది. అంతకుముందు మోసయ్యపేట, సింగవరం, గోకివానిపాలెం, భీమవరం, తాళ్లపాలెం గ్రామాలను సందర్శించి ఉపాధి పథకం కూలీలతో మమేకం అయ్యారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, అద్దంకి సతీష్, చిన్ని వల్లభనారాయణరావు,మిస్కా రమణ, గోకివాడ గోవింద, నిమ్మదల రమేష్, హనుమంతు వెంకట్, కొంద్రా శ్రీనివాసరావు, అల్లం శంకరరావు, ఇందల ముసిలినాయుడు, చిన్ని రాజీవ్, గుమ్మడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

82 వ వార్డులో..

అనకాపల్లి: మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ పట్టణపార్టీ అధ్యక్షుడు మండపాటి జానకీ రామరాజు అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, పూడిమడక రోడ్ రామాలయంవీధిలో సోమవారం ప్రచారం చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఉపముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోమ పార్టీ నాయకులు దాడి బోగలింగేశ్వరరావు గైపూర్ రాజు, కూండ్రపు సత్తిబాబు, మళ్ల స్వామి, కాంద్రేగుల సతీష్, సత్యనారాయణ, అల్లు త్రినాథ్, బొబ్బిలి గోవింద, పలకా చంటి, పలకా వాసు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సోమవారం పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి. సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కన్నబాబు రాజు, ఎంపీగా ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. వాడనర్సాపురంలో సర్పంచ్ కారె రామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలి

మునగపాక: ఐదేళ్ల కాలంలో మునగపాకలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. ఆదివారం రాత్రి మునగపాక నుంచి కశింకోటకు వెళ్లే దారిలో రైతుల కమతాల్లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ద్వారా మెరుగైన సేవలందాయన్నారు. ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు,పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీ సూరిశెట్టి రాము,రైతు సంఘ ప్రతినిధులు బుద్ద వెంకట్,ఆడారి వెంకటప్పారావు,పెంటకోట రాము,పెంటకోట శ్రీనివాసరావు(నెట్),సూరిశెట్టి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల బూడి ముత్యాలనాయుడు,యు.వి. రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరుతూ ఆయన మండలంలోని నారాయుడుపాలెం గ్రామంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మేలు జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,పార్టీ నేతలు కారుకొండ రాజు, కొయ్య చక్రం, శేషు, చందనాటి శ్రీనివాసరావు, దొడ్డి బాలాజీ,మద్దాల నాగప్పారావు,బొడ్డేడ లిల్లీ, సరిసా శ్రీనివాసరావు,పిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. నరేంద్రపురంలో వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి శ్రీనివాసరావు సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

యలమంచిలి: వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి జరుగుతుందని అని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. సోమవారం రాత్రి యలమంచిలి మున్సిపాలిటీ రామారాయుడుపాలెం గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు,ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్ మరిణేశ్వరరావు, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరులో వినాయకగుడివద్ద ప్రచారం చేస్తున్న, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ వరహా సత్యవతి, మలసాల ధనమ్మ, బీశెట్టి జగన్


నరేంద్రపురంలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ లక్ష్మి


రామారాయుడుపాలెంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, బొద్దపు యర్రయ్యదొర

అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు వీరే

అనకాపల్లి: నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బరిలో 12 మంది అభ్యర్థులున్నట్టు జేసీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.జాహ్నవి చెప్పారు. మలసాల భరత్‌కుమార్(వైఎస్సార్‌సీపీ),ఐ.ఆర్.గంగాధర్(కాంగ్రెస్), సూదికొండ మాణిక్యలరావు(బీఎస్పీ), పొలమరశెట్టి అంబికాదేవి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), ఒమ్మి వెంకట యాదవ్(సమాజ్‌వాజ్‌పార్టీ), కనిశెట్టి సురేష్‌బాబు(జై భారత్ నేషనల్ పార్టీ), కొణతాల రామకృష్ణ(జనసేన), తోట వెంకటసాయి ముకుంద్ (ప్రజా ప్రస్థానం పార్టీ), దొమ్మేటి అప్పారావు (రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా), వి.వి.రామచంద్రరావు(ప్రేమ్ జనతాదళ్‌పార్టీ), ఆళ్ల సత్తిరాజు(ఇండిపెండెంట్), కాపారపు సత్యనారాయణ(ఇండిపెండెంట్) పోటీలో ఉన్నారు.

యలమంచిలిలో 10 మంది

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది.యలమంచిలి 32లో మొత్తంగా 18 మంది నామినేషన్లు దాఖలు చేయగా వివిధ కారణాలతో నలుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 14 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు అధికారులు తేల్చారు.చివరి రోజు నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థులు సుందరపు రవికుమార్, బొచ్చ శ్యామల,ఎరిపిల్లి కాసులు,మేరుగు రాజబాబు సోమవారం నామినేషన్లు ఉపసంహరించుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో బరిలో 10 మంది మిగిలారు.వారిలో ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(వైఎస్సార్‌సీపీ), అనంతరామ నర్సింగరావు(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్),లంబ శ్రీనివాసరావు(బీఎస్పీ),బి.అమ్మాజమ్మ(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), అరుష్ కుమార్ సుందరపు(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ),దూది పూర్ణ చంద్రరావు(జై భారత్ నేషనల్ పార్టీ),బోజ నాగేశ్వరరావు(రీ ఫార్మ్స్‌పార్టీ ఆఫ్ ఇండియా),సుందరపు విజయ్ కుమార్(జనసేన పార్టీ)ప్రగడ అన్నపూర్ణ(స్వతంత్ర),మొల్లేటి రమేష్(స్వతంత్ర) పోటీలో ఉన్నారు.

కొణతాలకు షాక్

వైఎస్సార్‌సీపీలో అనుచరుల చేరిక


అనకాపల్లి: వైఎస్సార్‌సీపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కొణతాల వీరాభిమానులతో ఉత్తరాంధ్ర జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


అచ్యుతాపురం: ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో పార్టీలోకి చేరిన భీముని బాబ్జి


అచ్యుతాపురం: ఎమ్మెల్యే కన్నబాబు రాజుతో వైఎస్సార్ సీపీలోకి చేరిన గండి రామునాయుడు


మునగపాక: ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న జనసేన కార్యకర్తలు

అనకాపల్లి: జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆయన వీరాభిమానులు వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం వీరికి కశింకోట మండలం ఎస్ఆర్ గార్డెన్స్‌లో రాజ్యసభ సభ్యుడు, ఉత్తరాంధ్ర జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ (జనసేన) వీరాభిమానులు బుద్ద శ్రీనివాసరావు (గవరపాలెం, బెల్లం మార్కెట్ వర్తకుడు), గోలి వెంకటరావు (దేమునిగుమ్మం, ఎస్‌బీఐ యూనియన్ మాజీ కార్యదర్శి), షేక్ జిలాని (అనకాపల్లి మండలం బీఆర్టీకాలనీ) మాట్లాడుతూ 1988 నుంచి కాంగ్రెస్ పార్టీలో కొణతాల రామకృష్ణ వెంట ఉండేవారమన్నారు. కూటమిలో కార్యకర్తలకు, నాయకులకు విలువ లేకుండా పోయిందన్నారు. కరోనా వంటి విపత్తుల్లో దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా సేవలందించారని తెలిపారు. పైసా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేయడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మే 13న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, కశింకోట మండల సీనియర్ నాయకుడు కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి...

అచ్యుతాపురం: మండలంలోని గండివానిపాలెంకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గండి రామునాయుడు వైఎస్సార్ సీపీలో చేరారు. కొండకర్ల గెస్ట్ హౌస్‌లో ఆయన ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్,గొర్లెప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

జగన్నాథపురం మాజీ సర్పంచ్...

అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురానికి చెందిన మాజీ సర్పంచ్ భీముని బాబ్జి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగన్నాథపురం విచ్చేసిన కన్నబాబు రాజు సమక్షంలో పార్టీలోకి చేరారు.

మునగపాక నుంచి జనసేన నాయకులు..

మునగపాక: రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంద్రేగుల చందు ఆధ్వర్యంలో మునగపాకకు చెందిన పలువురు జన సైనికులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నిఖిల్, పవన్, సూర్య, విజయ్, పండు, లక్ష్మణ్, ప్రసాద్, రాజు, తేజ, సాయి, మహేష్ ఉన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు తాళ్లమ్మ జాతర

• ఐదు గ్రామాల్లో ఉత్సవ శోభ

యలమంచిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారి జాతరను మంగళవారం నిర్వహించడానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. మండలంలో ప్రసిద్ధి చెందిన తాళ్లమ్మతల్లి జాతరను పురుషోత్తపురం, కొత్తలి, పేరాంటాలపాలెం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం, నాయనమ్మపాలెం గ్రామాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. సోమవారం రాత్రి పురుషోత్తపురం గ్రామంలో అమ్మవారి ఘటాలు ఊరేగించారు. ఉయ్యాలలు ఏర్పాటు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సంబరం చేశారు.భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం జరిగే జాతరకు గ్రామంలో భారీ విద్యుత్ దీపాలంకరణ,మందుగుండు సామగ్రి సెట్టింగ్‌లు,వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.భక్తులకు క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు.తాళ్లమ్మ జాతరను మండలంలో ఐదు గ్రామాల ప్రజలు నిర్వహించడంతో రూరల్ ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అనకాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ తేజేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం ...మండలంలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన సూరిశెట్టి వెంకటరామారావు(58) ఈనెల 21న దిబ్బపాలెం నుంచి అనకాపల్లికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగివెళుతుండగా, ఇంటి సమీపంలో ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి జారి పడిపోయాడు. తలపై తీవ్ర గాయమవడంతో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వెంకటరామారావు మృతిచెందినట్టు మృతుడి తమ్ముడు లీలా కృష్ణసీతారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

'మళ్లీ బీజేపీ వస్తే భవిష్యత్తు అంధకారమే'

అనకాపల్లి: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వ వస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగిన సీపీఐ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీని ఓడించకపోతే దేశం ప్రమాదంలో పడుతుందన్నారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీఅభ్యర్థులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు


బార్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్ష,కార్యదర్శులు దూళి నూకరాజు, పి.వి. రమణ

యలమంచిలి రూరల్: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం రసవత్తరంగా జరిగాయి. చాలాకాలం తర్వాత పాలకవర్గానికి రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నికలు జరిపారు. దీంతో ఓట్ల లెక్కింపు,ఫలితంపై తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది.స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో ఉన్న న్యాయస్థానాల సముదాయంలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో .దూళి నూకరాజు అధ్యక్షునిగా, ఉపాధ్యక్షునిగా డీఎస్ఎన్ రాజు ఎన్నికయ్యారు. సంఘం సంయుక్త కార్యదర్శి పదవికి ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో కొఠారు చిన్నయ్యదొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది దొడ్డ నాగేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కొత్త,అధ్యక్ష కార్యదర్శులకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఘనంగా పుష్పోత్సవం


మునగపాక భీమేశ్వర స్వామి ఆలయంలో పుష్పోత్సవం

మునగపాక: స్థానిక పంచాయతీ వీధిలోని పాలేశ్వర భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి పుష్పోత్సవ ఘనంగా జరిగింది. శివ పార్వతుల కల్యాణంలో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డి-1 సెక్షన్ పరిధిలో లక్ష్మీనారాయణనగర్, చేపలు బజార్ ఏరియా, నెయ్యిలవీధి, పిల్లవారివీధి, చిన్నరాజుపేట, గొల్లవీధి, రైల్వే స్టేషన్ రహదారి, డి-2 సెక్షన్‌పరిధిలో వన్‌వేట్రాఫిక్‌డౌన్ ఏరియా, కస్పావీధి, బండిగాడి వీధి, ఎన్టీఆర్‌ఆస్పత్రి ఏరియా, చిన్ననాలుగురోడ్డు జంక్షన్, రఘురామ్‌కాలనీ, గోపాలకృష్ణ థియేటర్ ఏరియా, కొప్పాకబ్రిడ్జి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి రూరల్: రాంబిల్లి రూరల్ ఫీడర్ పరిధిలో మంగళవారం 3 గ్రామాలతో పాటు మరో మూడు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.సోమలింగపాలెం,కట్టుపాలెం, రామారాయుడుపాలెం,యలమంచిలి,ఎర్రవరం,కొత్తపాలెంలలో వ్యవసాయ కనెక్షన్లకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

సామాజిక పింఛన్ల పంపిణీకి చర్యలు

అచ్యుతాపురం: మండలంలో మే ఒకటో తేదీన సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్టు ఎంపీడీవో సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని 11,167 మంది పింఛన్‌దారుల్లో 8,240 మంది ఆధార్ అనుసంధాన బ్యాంక్ ఖాతాలకు మే ఒకటో తేదీన సొమ్ము జమజేస్తామని తెలిపారు. మిగిలిన 2,927 మందికి సచివాలయ సిబ్బంది మే 3 తేదీలోగా నేరుగా అందజేస్తారని తెలిపారు. పింఛన్‌దారులెవరూ సచివాలయాలకు వెళ్లనవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు ప్రారంభం


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి దేవస్థానంలో వచ్చేనెల 7న జరగబోయే నెల పండగా సందర్భంగా అమ్మవారి ఘటాల ఊరేగింపును సోమవారం ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ వరకూ ఘటాలను పట్టణ వీధులు ఊరేగించనున్నట్టు చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం


శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సరోజిని

అచ్యుతాపురం: స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ పి.సరోజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా బాటసారుల దాహార్తిని తీర్చవచ్చన్నారు.అనంతరం గ్రంథాయలం లోని పుస్తకాలను పరిశీలించారు.అక్కడ పుస్తకాలు,పేపర్లు చదువుతున్న విద్యార్థులతో ముచ్చటించారు.లైబ్రేరియన్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.